ఎవరిని మెచ్చుకొందురు?

చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు గారు

౧

"లోకం అతిచెడ్డది తమకు ఎట్టిసంబంధములేని విషయాలలోకూడా లేనిపోనిజోక్యం కలుగజేసుకొని అమాయకులగు మానవుల భావిఔన్నత్యానికి అడ్డుతగిలేదుర్జనులు లోకంలోఉన్నారు భాగ్యవంతులు తమకు లొంగిఉండే బీదలను పెక్కువిధముల పరిహాసంపాలుచేస్తారు అదేమి అన్యాయమోగాని పరాత్పరుడు ఎంత బీదవాడికైనా అభిమానమును గల్పించియున్నాడు అభిమానమును చంపుకొని, పొట్టకూటికి ధనికులనేమాటలనుపడుతూ లోలోపలకుమిలి కుళ్ళిపోతున్నారు లోకంలో ఎంతోమందిబీదలు 'ధనికులేమిజేసినా లోకం మాట్లాడదు కులటనుతీసుకొనివచ్చి ధనికుడు గృహంలోఉంచినా స్వయంవరంవల్లజరిగిన క్రొత్తతీరువివాహమని లోకం సమర్థిస్తుంది, కవులు పద్యాలతో పొగిడేస్తారు. గర్భదరిద్రుడు మనసార ఒకయువతిని ప్రేమించి సక్రమపద్ధతిని వివాహమాడదలచినపుడు, ఆ విషయాన్ని విమర్శించి వారిపై నిందలుగల్పించి వారిసౌఖ్యానికి విఘాతముగలిగిస్తారు లోకులు అన్నీ చూస్తూనేఉన్నాడు పరాత్పరుడు, ఆయన పాదాలకడ బ్రతుకు వెళ్ళబోసుకునేభాగ్యం కలిగితేచాలు'' అని తనలోతాను విసుగుచెంది కుర్చీలో వాలిపోయినాడు గోపాలరావు. హృదయంలో దుఃఖదావానలము చెలరేగినతరువాత ఎంతధీరుడైనా అసమర్థుడైపోతాడు. ధనికులచే పోటుమాటలు పడటంకంటె ఏవిషమోత్రాగి ఈలోకంవదలి వెళ్ళటమే సర్వోత్కృష్టమైనపని.

గోపాలరావు విద్యాధికుడు ఆతనిహృదయ మెంత నిర్మలమో—ఆతని వదనమంత సుందరము. వత్సరమునకు ఐదారువందలు రాబడిగల ఆస్తికలవాడు. ఆతనికి చిన్నతనమందే వివాహమైనది; భార్యపేరు వకుళ.

చిన్నతనమందే వివాహంచేస్తే చెప్పినట్లువింటారు, పెద్దవాండ్లయినట్లయితే తమకు నచ్చినపిల్లనే తెమ్మంటారనే అభిప్రాయంవలననే మనహిందువులలో బాల్యవివాహాలు అభివృద్ధిలోనికి వచ్చినవని ప్రతీతి గోపాలరావు తల్లిదండ్రులు అట్టిఅభిప్రాయము కలిగియున్నవారు కాకపోయినా తమకుఱ్ఱవానికి పదేండ్లకే పెండ్లిచేశారు నేడు నిజంగా విచారిస్తే గోపాలరావుహృదయంలో వకుళకు తావులేదు. ఆహృదయము నాక్రమించియున్నది వేరొకవనిత—ఆమె శ్రీలత చిన్నతనంలో ఒకేబడిలో చదువుకొని, ఒకేచోట ఆడుకొని, ప్రతిబొమ్మలపెండ్లిలో గోపాలరావు పెండ్లికుమారుని తండ్రిగా శ్రీలత తల్లిగాఉండి, పసితనమునుండి ఒకరినొకరుప్రేమిస్తూ, తమజీవితమంతా ఒకేచోట వారు గడుపదలచిరి. కాని సరిగా జ్ఞానంకలుగకపూర్వమే, గోపాలరావు వకుళకు భర్తగామారిపోయినాడు. అది యొకబొమ్మలపెండ్లి అనుకున్నారు శ్రీలతాగోపాలరావులు. ఆపెండ్లిరోజు శ్రీలత పేరంటమునకువచ్చి, గోపాలరావు వకుళతో బంతులాడుతుంటే ముసిముసినవ్వులతో చూచినది .ముందేమిరానున్నదో గ్రహించలేదాపసికూన.

నేడు గోపాలరావు ఇరువదివత్సరముల యువకుడు; శ్రీలత పదునెనిమిదివత్సరముల యువతి. అజ్ఞానములో తాముండగా జరిగిన పొరపాటు ఇప్పుడు గ్రహించారాయువతీయువకులు చిన్ననాటనుండి పెరిగి పెనవైచుకొనియున్న ప్రేమలతనుత్రెంచి శ్రీలతను నిరాకరింపసాహసింపలేదు గోపాలుడు. తల్లిని, తండ్రిని వదలి కాపురమునకువచ్చిన భార్యయగు వకుళను ఎలదనలేదు గోపాలుడు. ఒకటి అలభ్యము—వేరొకటి అమూల్యము.

శ్రీలతకెన్నియో సంబంధములు వచ్చినవి—ఆమె పెడమొగము ద్రిప్పనది స్త్రీలకు వివాహవిషయము లందు స్వాతంత్ర్యములేదు వరుడు కుంటివాడైనను, గ్రుడ్డివాడైనను, చెడుప్రవర్తనగలవాడైనను బాలికను ప్రశ్నింపక తమకిష్టమైనంతనే పెండ్లిచేయు అలవాటింకను మనయందంతరింపకుండుట హాస్యాస్పదము పెండ్లి ముచ్చటవస్తే పిల్లమంచిదేనా? అంటారుగాని పిల్లవాడిసంగతి కనుగొనరు ఇట్టిపక్షపాతమే మనదేశకల్యాణమునకు, సంఘాభ్యుదయమునకు వేరుపురుగు కొంచెము చదువుకొనినవారుగనుక శ్రీలతయొక్క తల్లిదండ్రులు ఆమెను ఈవిషయంలో శ్రమపెట్టలేదు, ఆమెకునచ్చనిదే వివాహంచేయదలపెట్టలేదు తల్లిదండ్రులయొక్క విద్యుక్తధర్మమదియేకదా!

దినములుగడచినవి మాసములు సంవత్సరములు గడచినవి శ్రీలత వివాహమాడలేదు గోపాలరావు వకుళను పెండ్లాడియుండి మరల వివాహమెట్లుచేసుకొనునని ఆమె కనుమానములేకపోలేదు, కాని ఆమె తన హృదయమును మార్చుకొనలేకపోయెను తాను వకుళను వివాహమాడియుండి మరల శ్రీలతనెట్లు వివాహమాడగలననే అనుమానము గోపాలరావునకు లేకపోలేదు, కాని అతడు తనహృదయమును మార్చుకొనలేకపోయెను గోపాలరావునకు శ్రీలతయందేమిగుల ప్రేమగలదని వకుళ గ్రహించకపోలేదు కాని ఆమె తన హృదయమునందలిఆశను మార్చుకొనలేకపోయెను విద్యాగంధమెరిగినవారగుటచే వీరితల్లిదండ్రు లీవిషయమునం దెట్టిజోక్యమును కలుగజేసికొని యుండలేదు లోకముమాత్రము ఈవిషయమెట్లు పరిణమించునోయని జాగ్రత్తగావేచియున్నది. పొట్టకూటికై గోపాలరావు ఒకజాగీరుదారుకడ గుమస్తాపనికిచేరాడు. అప్పుడే ఆజాగీరుదారు ఈవిషయాన్నిగురించి గోపాలరావుతో అనరానిమాటలన్నాడు ఆగ్రామములో చాలామంది గోపాలరావును వెక్కిరించారు 'నీబ్రతుకున కొకభార్యచాలు' అన్నారు కొందరు. 'ప్రేమపేరుబెట్టి కనుపించిన కులట నల్లాకట్టుకుంటాడువీడు' అన్నారు మూఢులుకొందరు 'లోనవెలుగుచున్న పవిత్రప్రణయజ్యోతిని హృదయంచీల్చి, ఎల్లాలోకానికి చూపించగలను; తనకు సంబంధములేకపోయినా ఈపాపిష్టిలోకము అనరాని వినరానిమాటలనుచున్నది' అని తనలోతానే దిగులుపడిపోయివాడు గోపాలరావు

ఇంతలో ఐగోపాసంగ్రామము వచ్చినది. దొరతనమువారు ప్రతిగ్రామమునందు విచారించి సైనికులను చేర్చుకుంటున్నారు సమయమువచ్చినదని ఎవరితో చెప్పకుండా గోపాలరావు సేనలో చేరి యుద్ధానికి వెళ్లాడు.

మరునాడు గోపాలరావుచేసినపనికి అందరు ఆశ్చర్యపోయినారు వకుళ స్మృతితప్పిపడిపోయినది శ్రీలత జీవించునను ఆశలేదు

౨

కాలం వడిగా గడచిపోవుచున్నది గోపాలరావువెళ్ళిపోయి మూడువత్సరాలు దాటినవి. యుద్ధము పరిసమాప్తియైనది కాని అతడు తిరిగిరాలేదు. యుద్ధంలో చనిపోయినాడని వదంతిప్రబలిపోయినది. అతని తల్లి మంచముపట్టి కొడుకును తలచుకుంటూ ప్రాణాలువిడచినది. తండ్రి యిల్లుతాళంవైచి కొంతసొమ్ము తీసుకొని కుమారుని కనుగొనివస్తానని చెప్పి పిచ్చివాడిలాగా దేశమువెంటపడ్డాడు.

౩

అప్పుడే సూర్యుడు తూర్పుకనుమలనుండి తొంగిచూస్తున్నాడు తెలిపట్టుచీర ధరించి, చేతపళ్ళెము పట్టుకొని దేవాలయపుసోపానములనెక్కుచున్నది శ్రీలత వాడిపోయిన చెక్కులు-ఎఱ్ఱబడియున్న కన్నులు, పాలిపోయినముఖము—ఆమె శోకదేవత రూపుదాల్చినది. ఆమె దేవాలయముకేగి దేవికి నమస్కరించి లేచు

నంతలో తటాలున మెడనున్న ముత్యాలహారము తెగిపోయినది. ఆమె హృదయము చివుక్కుమన్నది—వెనుదిరిగి వెడలిపోయినది

పదినిముసములు గడచినవి దేవాలయములోనికి వకుళ ప్రవేశించినది మూడుసంవత్సరముల క్రింద ముడివైచియుంచిన కేశములు—శల్యావశిష్టమైయున్న దేహము—ప్రపంచమునందలి దుఃఖమంతయు ఆమెయందే నిలచియున్నది దేవాలయములోనికేగి దేవికి నీరాజనమొసగ పళ్ళెమున కర్పూరము వెలిగించినది. చేయిజారి పళ్ళెముక్రింద బడెనది కనులవెంట నీరుతిరిగినది—వెంటనే వెడలిపోయినది.

౪

“ఆకనుపించు రావిచెట్టువద్దనున్న మఠములో కూర్చునియున్నయోగికి మనవకుళభర్తపోలికలున్నయి సుమా!” అని నీలాటిరేవులో నీళ్లుముంచుకుంటూ అన్నది ఒకయెలనాగ “నేనుసరిగా చూడలేదమ్మా!” అంటూ జవాబుచెప్పింది తల్లో పూలుసవరించుకుంటూ వేరొకవనిత

అప్పుడే ఈసంగతి ఊరంతా పాక్కిపోయింది. మఠంవద్ద జనులు గుంపులు గుంపులుగా మూగారు. మఠము వెలుపలిభాగంలో ఒకయోగి ధ్యానంలో కన్నులుమూసికొనియున్నాడు చుట్టూ ఎంతచప్పుడౌతున్నా అతడు కనులువిప్పలేదు ఎన్నోగంటలవరకు వేచియుండి తుదకు విసిగిపోయి అందరు వెళ్లిపోయినారు. కొందరు గోపాలరావుకాదన్నారు, కొందరు ఔనన్నారు

చీకటిపడినది. యోగిఇంకా జపముముగించలేదు. అప్పుడప్పుడు రావిచెట్టునుండి రాలిపడుచున్న పండుటాకుచప్పుడుతప్ప, అంతానిశ్శబ్దముగానేయున్నది ఇంతలో ఆమఠమునందొకమూల మెల్లగా గాజులచప్పుడు వినవచ్చినది—ఆకటికచీకటిలో శ్రీలత మఠములోనికివచ్చినది. యోగినిసమీపించి, నమస్కరించి కుడివైపున కొంచెముదూరముగా నిలిచినది యోగి కన్నులువిప్పలేదు. వినయమువెల్లివిరయ మెల్లగా శ్రీలత “హృదయేశ్వరా! చిన్ననాటనుండి తమ్మేదైవముగా నమ్మియుండి నేటివరకు అన్యునిభజయనొల్లక తమకై వేచియున్నదాసి శ్రీలత తమదర్శనమునకై వచ్చినది. ”ఆమె ఇంకేమియో చెప్పవచ్చినది కాని దుఃఖమాపుకొనలేకపోయెను యోగి ఏమియుమాటాడలేదు తుదకు కన్నులనైనవిప్పలేదు రాత్రిరెండుగంటలైనది. చెంతనున్నశ్మశానమున నక్కలకూతతప్ప మరెట్టిశబ్దము వినవచ్చుటలేదు. మెల్లగా మెట్టెలచప్పుడు మఠమున వినిపించెను ఆయంధకారమున వకుళలోనికివచ్చినది. యోగికి నమస్కరించి ఎడమభాగమున నిలచినది. ఎదుటనిలచియున్న శ్రీలతను ఆమె చూడనేలేదు. శ్రీలత వకుళనూ చూడలేదు ఇరువురికన్నులు యోగివైపునకేతిరిగియున్నవి కొంతసేపునకు వకుళ “తమరాకకై నిరంతరము వేచియున్నదాసి, వివాహమున తాము భార్యగాబడసిన కాంత—వకుళ తమ్ముదర్శింపవచ్చినది ”అని మెల్లగాబల్కెను యోగిఎట్టి ప్రత్యుత్తరమునొసగియుండలేదు. వకుళా శ్రీలతలట్లే నిలచియుండిరి అప్పుడే తెల్లవారవచ్చుటచే కొంతతడవునకు వారు వెడలిపోయిరి.

మఱునాడు పురజనులెప్పటివలె గుంపులుగుంపులుగా యోగికడకు వచ్చియుండిరి. యోగికన్నులు విప్పనేలేదు, సమర్పించిన ఫలములనైన పుచ్చుకొనలేదు మరల విసుగుచెంది వారందరు వెడలిపోయిరి.

చీకటిపడినంతనే శ్రీలత యోగికడకేగినది; ఎప్పటిస్థలమున మాటాడక నిలచినది. ఒకగంటగడచినంతనే వకుళ ప్రవేశించినది. ఈదినము శ్రీలత వకుళనుగుర్తించి చిరునవ్వునవ్వినది; వకుళ శ్రీలతను గుర్తించి కనులతో నమస్కరించినది

దాదాపు రాత్రి పదిగంటలు దాటినది. ఎల్లెడనిశ్శబ్దము—యోగి ఒక్కసారికన్నులను విప్పినాడు. మరల వెంటనే ధ్యానమున మనిగినాడు. రెండుగంటలు దాటినది, వకుళా శ్రీలత లట్లే నిలచియున్నారు. ఇంతలో యోగికన్నులువిప్పి శ్రీలతనుగాంచినాడు—తలద్రిప్పి వకుళనుచూచినాడు మరలనిశ్శబ్దము. కొంత తడవునకు యోగి మెల్లగా "నాహృదయ మిపుడు ద్రాసుచందముననున్నది ఒకభాగమునుండి కొంతతీసినచో రెండవభాగము క్రుంగిపోవును రెంటిని సమస్థితియందుంచుటకు పాపిష్టిలోకము నన్నుచికాకుపరచి, భయ పెట్టినది—నేటితో ఈదీపము చల్లారును"అని పలుకుచు అత డాస్థలమునువదలి వడివడిగా వెడలిపోయెను.

శ్రీలత వకుళను సమీపించి ఆమె రెండుచేతులు పట్టుకొని హృదయముపై నిడుకొని ఏదియోచెప్పవచ్చి దుఃఖభారమున నేలగూలెను వకుళ శ్రీలతపాదములపైబడి కనులకద్దుకొనెను. మరునిముసమున వారాస్థలము వదలిపోయిరి.

సమీపమున ప్రవహించుచున్న కృష్ణానదికడ కేగినది వకుళ మొలలోతు నీటిలోనిలచి ఏదియోధ్యానించు చున్నది. ఇంతలో పెద్దచప్పుడు—వకుళ భయపడి ముందునకుచూచి "అదిగో శ్రీలత దారితీసినది—నేనేనిర్భాగ్యురాలను" అనుచు ఆమెతుదిసారి మునిగిపోయినది. ఏమియు ఎరుగనట్లు కృష్ణానది ఎప్పటివలెనే ప్రవహించుచుండెను

※

తెల్లవారునప్పటికి రెండుకళేబరములు నీటిజాలునందు తేలియుండెను. కొందరు పడవవారు మిగుల శ్రమతో ఆకళేబరములను గట్టునకుతెచ్చిరి వకుళా శ్రీలతలు విగతజీవులైనను వారి వదనములయందింకను చిరునగవు చిందులుద్రొక్కుచుండెను. గ్రామమున వార్తవ్యాపించినకొలది వేలకొలది ప్రజ లచ్చటకు వచ్చు చుండిరి ఆప్రాంత మంతయు జనులతోనిండిపోయెను ఎచట జూచినను గుసగుసలే. ఎచట విన్నను వింత సంభాషణములే

ఇంతలో ప్రజలయం దొకఅలజడి ప్రారంభమయ్యెను. వేరొకకళేబరము నీటియందుకొట్టుకొని వచ్చు చున్నట్లు కానుపించెను కొందరు ఒకచిన్నపడవతో బయలుదేరి ఆకళేబరమును ఒడ్డునకుజేర్చిరి. ఆకళేబరము గోపాలరావుదని గుర్తించినంతనే అచ్చటనున్న వారంద రొక్కపెట్టున ఏడ్చిరి.—పాడులోకమున కిప్పుడు కలిగినది పరితాపము!—

వకుళా శ్రీలతల కళేబరములను స్నానముచేయించి పసుపుచీరెలగట్టిరి వదనములందు కళ్యాణపుబొట్టు నిడిరి. తల్లిదండ్రులొసగిన నగలెల్ల అలంకరించిరి. బుగ్గనకాటుకనిడిరి గోపాలుని కళేబరమునుగూడ స్నానముచేయించి పెండ్లికుమారునకువలయు శృంగారములన్నియుజేసిరి గోపాలుని పరుండబెట్టి ఎడమవైపున వకుళను కుడివైపున శ్రీలతనుపరుండజేసిరి వారిదేహములను మల్లెపువ్వులతో దట్టముగాకప్పిరి మేళతాళ ములతో గ్రామమంతట నూరేగించిరి. ఈదృశ్యమునుగాంచి కంటనీరుపెట్టని కాంతలేదు. దిగులుపడని పురు షుడులేడు ప్రేమయందలి పవిత్రతను లోకము నేడు గ్రహించినది

అదిగో మంటలెగయుచున్నవి. ఆపొగపొరలయందు సతీద్వయసమేతుడై గోపాలుడు ఈలోక మునువదలి పరలోకమునకేగుచున్నాడు. వేలకొలదిప్రజలు చితిచుట్టును తలలువంచినిలచియున్నారు. సూర్య బింబమున కింతలో కారుమేఘ మడ్డుతగిలినది—కాంతిపుంజము చీకట్లంగలసిపోయినది.

పాఠకులారా! ఎవరిని మెచ్చుకొందురు? లోకమునకువెరచి తనసౌఖ్యమును లక్ష్యపెట్టక సర్వము త్యజించిన గోపాలరావునా? పవిత్రప్రేమవలన ప్రియుని పాదాంకములచెంత ఆత్మార్పణమొనర్చిన శ్రీలతనా? భర్తయే దైవమునినమ్మి పరలోకమునం దాతనితో సౌఖ్యమనుభవింపజనిన వకుళనా?